క్లుప్తంగా

పిచ్చి మొక్కల తొలగింపు



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న ఉపాధి కూలీలు

సాక్షి ఎఫెక్ట్..

ఓబులవారిపల్లె : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలకు సంబంధించి 'సాక్షి' దిన పత్రికలో సోమవారం 'పాఠశాలలో పిచ్చి మొక్కలు' అనే శీర్షికన వార్తను ప్రచురించడం జరిగింది. వెంటనే స్పందించిన అధికారులు మంగళవారం జాతీయ ఉపాధి హామీ పనులు ద్వారా జెడ్పీహెచ్ఎస్‌లో పిచ్చి మొక్కలు, చెట్లను తొలగించే పనులు ప్రారంభించారు. పాఠశాల పరిసరాలను శుభ్రం చేయించినందుకు అధికారులకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

సీపీఓకు శుభాకాంక్షలు తెలిపిన గ్రామస్తులు

ఓబులవారిపల్లె : ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ, మంగంపేట సీపీఓగా బాధ్యతలు చేపట్టిన గోపినాథ్‌ను మంగళవారం గ్రామ సర్పంచ్ మినుగు సుధాకర్, మాజీ ఎంపీటీ గునిపాటి రామయ్య కుమారుడు గునిపాటి కిరణ్, గ్రామస్తులు కలిశారు. అనంతరం సీపీఓ గోపీనాథ్‌కు సర్పంచ్ మినుగు సుధాకర్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. తదుపరి గ్రామస్తులు శాలువా, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం సీపీఓ గోపినాథ్ మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో తన విధులు సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కె.చలపతి, ఎ.చంద్రమోహన్, గునిపాటి కేశవులు, మంగాపురపు గంగయ్య, నారదాసు సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన



విద్యార్థుల యోగాను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పుల్లంపేట : మండల పరిధిలోని తిప్పాయిపల్లి ప్రాథమిక పాఠశాలను పుల్లంపేట ఎంపీడీఓ జయశ్రీ పరిశీలించారు. అలాగే చెత్తనుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించి గ్రామాలలో చెత్తను ప్రతిరోజూ సేకరించాలన్నారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి సంపదను సృష్టించాలన్నారు. అనంతరం విద్యార్థులు చేస్తున్న యోగాను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టరేట్ డీఏఓగా శ్రీధర్



రాజంపేట : రాజంపేట సబ్‌కలెక్టరేట్ పరిపాలనాధికారిగా బి.శ్రీధర్ రావు బాధ్యతలను చేపట్టారు. ఇక్కడ డీఏఓగా పనిచేస్తున్న శేషయ్య పదవీ విరమణ పొందారు. ఓబులవారిపల్లె తహసీల్దారుగా పనిచేస్తున్న శ్రీధర్‌ను సబ్‌కలెక్టరేట్ డీఏఓగా బదిలీపై వచ్చారు.

ఇ-కేవైసీపై ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

చిట్వేలి : అన్నదాత సుఖీభవ, ప్రధాన మంత్రి కిసాన్ పథకం ఇ-కేవైసీ సమయ పరిమితిని దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసిందని ఏఓ సుధాకర్ రైతులకు తెలిపారు. కావున పీఎం కిసాన్ కోసం ఇప్పటికే ఇ-కేవైసీ చేసుకున్న వారు ఇప్పుడు అన్నదాత సుఖీభవ కోసం ఇ-కేవైసీ అవసరం లేదని ఏఓ తెలియజేశారు.

జాబ్‌మేళా విజయవంతం

రాయచోటి జగదాంబసెంటర్ : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలోని శ్రీ షిరిడీసాయి మహిళా డిగ్రీ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళా విజయవంతమైంది. ఈ జాబ్‌మేళాలో దాదాపు 400 మందికి పైగా అభ్యర్థులు పాల్గొనగా 233 మంది అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారు. కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ చలమారెడ్డి, కళాశాల డైరెక్టర్ మనోజ్‌కుమార్‌రెడ్డి, వినయ్‌కుమార్, స్కిల్ డెవలప్‌మెంట్ సిబ్బంది, నిరుద్యోగులు పాల్గొన్నారు.

పరామర్శ



కార్యకర్తను పరామర్శిస్తున్న మాజీ జెడ్పీటీసీ

సంబేపల్లె : మంగళవారం వేకువజామున పీలేరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో శెట్టిపల్లె గ్రామం పాలెంగడ్డ హరిజనవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సుబ్బరాయుడు, చంద్రలతో పాటు మరో కార్యకర్త తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతి రమాదేవి ఆసుపత్రిలో చికిత్స పొందుచున్న వారిని మాజీ జెడ్పీటీసీ గొర్ల ఉపేంద్రారెడ్డి పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ప్రమాదంలో గాయపడిన వారిని మాజీ ఎంఎల్‌ఏ గడికోట శ్రీకాంత్ రెడ్డి ఫోన్‌లో పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఆయన వెంట వైఎస్ఆర్సీపీ నాయకులు ఆనంద్ రెడ్డి, నరసింహారెడ్డి, నారాయణరెడ్డి, వినోద్, కోట ఆంజనేయులు, మహేశ్వర్, నాగరాజు, పాలెంగడ్డ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దకాలం తరువాత గంగమ్మ జాతర

- ఏడు దశాబ్దాల్లో రెండోసారి గంగమ్మ జాతరకు అంకురార్పణ
- జాతరకు పెద్దఎత్తున ఏర్పాట్లు



గాదెల గ్రామంలోని గంగమ్మ గుడి

ఓబులవారిపల్లె : మండల శివారు అటవీ ప్రాంత సమీపంలోని గాదెల పంచాయతీలో దశాబ్దకాలం అనంతరం గంగమ్మ జాతరకు మంగళవారం అంకురార్పణ చేశారు. గాదెల, తల్లెంవారిపల్లి, కొత్తపల్లి అరుంధతివాడ గ్రామాలలో మూడు రోజులపాటు జాతరను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పంచాయతీలో గొడవలు అనుకూల పరిస్థితులు లేకపోవడంతో దాదాపు 60 సంవత్సరాల తరువాత గాదెల గ్రామంలో పెద్దఎత్తున గంగమ్మ జాతరను గ్రామస్తులు నిర్వహించారు. అనంతరం తొమ్మిది సంవత్సరాల తరువాత ఈ ఏడాది గ్రామస్తులందరూ కలిసికట్టుగా జాతర నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ జాతర ఉమ్మడి జిల్లాలోనే ఎంతో పేరుగాంచింది.

మూడు రోజులపాటు ఉత్సవాలు

జాతర సందర్భంగా మంగళవారం ప్రారంభమైన గ్రామోత్సవం గాజుల కొత్తపల్లి గ్రామంలో నిర్వహించారు. నేడు బుధవారం గ్రామంలోని గంగమ్మ గుడి వద్ద అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఊరేగింపుగా తీసుకెళ్లి గురువారం తెల్లవారుజాములోపు నడివీధిలో ప్రతిష్టిస్తారు. గ్రామస్తులు పొంగుబాలు, ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకొని పండుగను జరుపుకుంటారు. గ్రామమంతా విద్యుత్ దీపాలతో అలంకరణలు, చలువపందిళ్లు పెద్దఎత్తున ఏర్పాటు చేశారు.

విదేశాలు, ఇతర ప్రాంతాల నుండి జాతరకు రాక

దశాబ్ద కాలం తరువాత గాదెల గ్రామంలో జాతరను నిర్వహిస్తుండటంతో జీవనోపాధికి విదేశాలకు వెళ్లిన వారంతా పెద్దఎత్తున గ్రామానికి చేరుకుంటున్నారు. అలాగే ఇతర రాష్ట్రాలు, ఇతర జిల్లాలలో ఉన్న బంధువులు, స్నేహితులు పెద్దఎత్తున జాతరకు తరలివస్తున్నారు. దీంతో గ్రామంలో మూడు రోజులపాటు పెద్దఎత్తున సందడి నెలకొంటోంది.

ప్రశాంతంగా జాతరను నిర్వహించుకోవాలి

గ్రామంలో అందరూ కలిసికట్టుగా ఎటువంటి గొడవలు లేకుండా జాతరను ఘనంగా నిర్వహించుకోవాలని రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం గాదెల గ్రామంలో ఎస్ఐ పి.మహేష్ నాయుడు సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు గ్రామస్తులతో మాట్లాడుతూ జాతరను పురస్కరించుకొని పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.



జాతరకు అంకుకార్పణ చేస్తున్న గ్రామస్తులు

ఫీజు దోపిడీని అరికట్టాలి



నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజన స్టూడెంట్స్ ఫెడరేషన్ నాయకులు, విద్యార్థులు

రాయచోటి టౌన్ : రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ ఫీజుల పేరుతో దోపిడీ చేస్తున్నాయని గిరిజన స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు నాగేంద్ర నాయక్ చౌహాన్ ఆరోపించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రాయచోటిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడ్మిషన్ల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా కనీసం ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఊరుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు అలాంటి పాఠశాలలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పలు కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలకు సీబీఎస్ఈ అనుమతులు లేనప్పటికీ తమకు అనుమతులు ఉన్నాయని విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రమంతటా ఇలాంటి అనుమతుల లేని పాఠశాలలను రాష్ట్ర మంత్రి నారా లోకేష్ గుర్తించి వాటి గుర్తింపును రద్దు చేయాలని కోరారు. జిల్లా అధికారులు సైతం మామూళ్ల మత్తులో మగ్గుతున్నారని ఆరోపించారు. ఇకనైనా అధికారులు అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్న విద్యాసంస్థలను గుర్తించి వాటి గుర్తింపు రద్దు చేసి సంబంధిత యజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫుట్‌పాత్‌పై ఉన్న అడ్డంకులను తొలగించాలి

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్టలో ఆర్‌అండ్‌బీ నిర్మించిన ఫుట్‌పాత్‌పై ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించాలని ఒంటిమిట్ట పంచాయతీ కార్యదర్శి సుధాకర్ మంగళవారం ఫుట్‌పాత్ పక్కన ఉన్న దుకాణాలకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌అండ్‌బీ నిర్మించిన ఫుట్‌పాత్ పక్కన ఉన్న దుకాణాదారులు వారి సామాన్లను, సూచిక బోర్డులు, ఫుట్‌పాత్‌పై అడ్డుగా ఉంచడంతో ప్రయాణికులు, ప్రజలు, భక్తులకు అసౌకర్యం కలుగుతోందన్నారు. అలాగే గ్రామ పంచాయతీకి సంబంధించిన గ్రీన్ అంబాసిడర్లు శుభ్రం చేస్తుంటే వారు శుభ్రం చేసిన వెంటనే అక్కడ అపరిశుభ్రం చేస్తున్నందున ఈ నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. నోటీసులు అందిన మూడు రోజులలో అడ్డంకులు తొలగించని వారిపై ఏపీపీఆర్ యాక్ట్ 1994 చట్టం ప్రకారం కేసు నమోదు చేయడం జరుగుతుందని తెలియజేశారు.

జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం

సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు నారా చంద్రబాబు వెన్నుపోటు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

రాయచోటి టౌన్ : జగన్ అంటే నమ్మకం.. అదే చంద్రబాబు నాయుడు అంటే మోసం అని రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా ఆరోపించారు. మంగళవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రాయచోటి పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు నాయుడు అంటే మోసం.. చంద్రబాబు అంటే వెన్నుపోటు అనే పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ సంక్షేమ పాలన.. కూటమి ప్రభుత్వ మోసపూరిత పాలనను ప్రజలకు అర్థవంతంగా ఉండేలా పుస్తకాన్ని రూపొందించామన్నారు. వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్ మాట్లాడుతూ ప్రభుత్వంలోకి రావడమే సంకల్పంతో కూటమిగా ఏర్పడి సూపర్ సిక్స్ పేరుతో హామీలిచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో 143 హామీలు గుప్పించి ఏడాది పాలనలో కేవలం రెండు పథకాలు మాత్రమే అమలు చేశారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొలిమి హరూన్ బాషా మండిపడ్డారు. అది కూడా వైఎస్సార్ సీపీ పోరాటానికి తలొగ్గి అమలు చేసినవే అని తెలియజేశారు. శిబ్యాల విజయభాస్కర్ మాట్లాడుతూ గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసి వైఎస్ జగన్ మాట నిలబెట్టుకున్నాడన్నారు. కార్యక్రమంలో మాజీ కో-ఆప్షన్ సభ్యుడు జాఫర్ అలీఖాన్, అన్నా సలీం, మాజీ కౌన్సిలర్ సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, నియోజకవర్గ మేధావులు ఫోరం అధ్యక్షులు జానం రవీంద్ర యాదవ్, వైఎస్సార్ సీపీ నాయకులు ఫైరోజ్, సల్మాన్, మహబూబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో రేషన్ పంపిణీ చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ యామిని

ఓబులవారిపల్లె : ప్రజలకు ఇబ్బంది కలగకుండా సకాలంలో రేషన్ పంపిణీ చేయాలని తహసీల్దార్ యామిని రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేషన్ పంపిణీ విషయంలో ఎక్కడా ఇబ్బందులు కలగకుండా సకాలంలో పంపిణీ చేయాలని, ఎక్కడైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం తహసీల్దార్‌ను, ఆర్ఐ మల్లికార్జున రెడ్డిని, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీడీ శ్రీనివాస్‌లను రేషన్ డీలర్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీలర్ల సంఘం అధ్యక్షులు మధు, డీలర్లు ఓడీ సురేంద్రారెడ్డి, రామిరెడ్డి, రాజు, హరినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బలిజ, తెలగ కులాలను బీసీలలో చేర్చాలి



పాదయాత్ర కమిటీ సభ్యులకు స్వాగతం పలుకుతున్న మండల బలిజ నాయకులు

నందలూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బలిజ, తెలగ, కాపు, ఒంటరి కులాలను బీసీ జాబితాలో చేర్చాలని బీసీ రిజర్వేషన్ సాధన కమిటీ నాయకులు సానా ప్రసాద్ డిమాండ్ చేశారు. బలిజలను బీసీ కులాలలో చేర్చాలంటూ శాంతియుతంగా చిత్తూరు నుంచి అమరావతికి 15 మంది బృందంతో బీసీ రిజర్వేషన్ సాధక కమిటీ చేపట్టిన పాదయాత్ర మంగళవారం నందలూరుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో స్థానిక బలిజ సంఘం నేతలు పాదయాత్ర సభ్యులకు ఘనంగా పూలమాల, శాలువాతో స్వాగతం పలికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బలిజ సంఘం నేతలు కాంట్రాక్టర్ బూశెట్టి వెంకటసుబ్బయ్య, ఉప్పుశెట్టి సుధీర్, కొట్టే శ్రీహరి, నారపుశెట్టి శివయ్య, ఉప్పుశెట్టి రెడ్డయ్య, పాటూరు రమేష్, జంగంశెట్టి హరి, భీమాముని స్వామి, బాలాంజనేయులు, పసుపులేటి సుబ్రమణ్యం, శ్రీరామ్ హరినాథ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై వేరుశనగ విత్తనకాయలు పంపిణీ

సుండుపల్లి : మండల పరిధిలోని సుండుపల్లి - 1, 2, 3 రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం సహాయ వ్యవసాయ సంచాలకులు (రెగ్యులర్)శ్రీలత నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యంగా రైతులందరూ ఖరీఫ్ సీజను ప్రారంభమైన సందర్భంగా సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను అన్ని రైతు సేవా కేంద్రాలలో వ్యవసాయ శాఖ ద్వారా 40 శాతం సబ్సిడీతో రైతులకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులు పట్టాదార్ పాస్ పుస్తకం తీసుకొని వెళ్లి మీ సమీప రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకుని కాయలను తీసుకోవాల్సిందిగా చెప్పారు. అదే విధంగా అన్నదాత సుఖీభవకు సంబంధించి పెండింగ్ లిస్టులో ఏ రైతులు ఉన్నారో వారు కచ్చితంగా ఇ-కేవైసీ చేయించుకోవాలని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్.మహబూబ్ బాషా, ఆర్ ఎస్ కే సిబ్బంది ముకుందర్, మల్లికార్జున, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అవసరాలు తీర్చడమే ధ్యేయం



గోకులాలు, నీటి తొట్టెలు నిర్మించుకోవడానికి అనుమతి పత్రాన్ని అందజేస్తున్న ఎంపీపీ గాలివీటి

వీరబల్లి : ప్రజల అవసరాలు తీర్చడమే తమ ధ్యేయమని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో మాట్లాడుతూ ప్రజల అవసరాలను దృష్టిలో పార్టీలు, కుల మతాలతో సంబంధం లేకుండా పనులు చేపడుతున్నామన్నారు.

ఇటీవల ప్రభుత్వం గోకులాలు, నీటి తొట్టెలు మంజూరు చేయడం జరిగిందని వాటిని రైతులు నిర్మించుకోవడానికి వీలు కల్పిస్తూ నిర్మాణం పనులు చేపట్టడానికి వెంటనే ఆమోదం తెలిపారు. అర్హతను బట్టి లబ్ధిదారులను ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. పార్టీలకు అతీతంగా పనిచేసినప్పుడే ఆ అధికారికి గానీ నాయకులకు గానీ గుర్తింపు ఉంటుందన్నారు. నిజమైన, అర్హతగల వారందరికీ ప్రభుత్వ పథకాలు అందాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తమ పార్టీ వ్యక్తులకే పనులు చేస్తుండటం, పథకాలు అందిస్తుండటాన్ని తప్పుబట్టారు. ఇప్పటికైనా అటువంటి ఆలోచనలను పక్కనపెట్టి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రామచంద్రారెడ్డి, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లూజు విత్తనాలను రైతులు కొనుగోలు చేయరాదు



ఒంటిమిట్ట: నారు మడి వద్ద రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారులు

సిద్దవటం : లూజు విత్తనాలను రైతులు ఎట్టి పరిస్థితుల్లోను కొనుగోలు చేయరాదని బద్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకులు నాగరాజ రైతులకు తెలిపారు. సిద్దవటం మండలం వంతాటిపల్లె రైతుసేవా కేంద్రం పరిధిలో ఉన్న ఎస్.రాజంపేట గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బద్వేల్ ఏడీఏ నాగరాజ మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు, సలహాలు చేశామన్నారు. అన్నదాత సుఖీభవ పథకం గురించి రైతులకు వివరించామన్నారు. రైతులకు జింక్ సల్ఫేట్, జిప్సమ్, 50 శాతం సబ్సిడీతో పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఎస్.రాజంపేటలో వరి ప్రధాన పంట రైతులకు ఉత్తమ యాజమాన్య పద్ధతుల గురించి వివరించామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు ప్రేమ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

వరి సాగులో మెళకువలపై అవగాహన

ఒంటిమిట్ట : వరిసాగులో రైతులు మెళకువలు పాటించడంపై అవగాహన ఉండాలని మండల వ్యవసాయ అధికారిణి మంజుల రాణి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నరసన్నగారిపల్లి, గొల్లపల్లి గ్రామ పొలాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారిణి మంజుల రాణి, జెడ్‌బీఎన్ఎఫ్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో వరి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ వరిసాగులో యాజమాన్య పద్ధతి, చీడపీడల నివారణ పద్ధతులను తెలిపారు. అంతేకాకుండా వ్యవసాయ శాఖ ద్వారా జిప్సన్ సబ్సిడీ కింద స్థానిక రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉందని, కావాల్సిన రైతులు గ్రామ వ్యవసాయ అధికారిణి సంప్రదించాలని తెలిపారు.అలాగే జెడ్‌బీఎన్ఎఫ్ అన్నపూర్ణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం కింద సబ్సిడీలో అందించే నవధాన్యాల కిట్టు వేసుకోవడం వలన నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని, అజోళ్లను వరి పొలాలలో పెంచడం వలన యూరియా వాడకం తగ్గించడమే కాక పశువులకు మేతగా కూడా వాడుకోవడం వలన పాలలో వెన్న శాతం పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ఏఓలు ప్రభాకర్ రెడ్డి, జయలక్ష్మి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ చంద్ర, జెడ్‌బీఎన్ఎఫ్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

చిట్వేలి : మండల పరిధిలోని మైలపల్లి, పోల్తోపల్లిలో మండల వ్యవసాయ అధికారి సుధాకర్ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతను వివరించారు. ఏఓ సుధాకర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల నాణ్యమైన దిగుబడితో రైతులు గిట్టుబాటు పొందవచ్చన్నారు. రైతులు భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని సూచించారు. అంతర పంటలు వేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల, అనుబంధ కమిటీల నియామకం

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లాలోని పలు మండలాలకు పార్టీ కమిటీలను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

చిన్నమండెం మండల పార్టీ కమిటీ

అధ్యక్షులుగా కె.గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సి.మునల్‌రెడ్డి, పి.రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శులుగా ఆర్.వెంకట్రామిరెడ్డి, డి.రెడ్డెప్ప, కె.అఫ్రోజ్, పి.రమేష్‌బాబు, కార్యదర్శులుగా బి.లక్ష్మిరెడ్డి, జి.సాయివీర్, అఫ్కాన్ సలీం, వి.శేషారెడ్డి, ఎం.ఆదినారాయణరెడ్డితోపాటు 15 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమించారు.

చిన్నమండెం మండల అనుబంధ విభాగాల అధ్యక్షులు

యువజన విభాగం అధ్యక్షులుగా ఎస్.అజారుద్దీన్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా కె.అమ్మాజీ, రైతు విభాగం అధ్యక్షులుగా టి.విశ్వనాథరెడ్డి, బీసీ విభాగం అధ్యక్షులుగా యు.శేఖర్, ఎస్సీ విభాగం అధ్యక్షులుగా పి.ఆంజనేయులు, మైనార్టీ విభాగం అధ్యక్షులుగా ఎస్.గౌస్ సాహెబ్, క్రిస్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షులుగా జి.సుధాకర్, విద్యార్థి విభాగం అధ్యక్షులుగా బి.రామ్మోహన్, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులుగా ఎన్.రెడ్డిప్రసాద్‌రెడ్డి, ఆర్‌టీఐ విభాగ అధ్యక్షులుగా బి.దేవేంద్రారెడ్డి, వలంటీర్ల విభాగం అధ్యక్షులుగా ఎల్.వెంకట రమణారెడ్డి, చేనేత విభాగం అధ్యక్షులుగా ఎస్.సుదర్శన్‌బాబు, వాణిజ్య విభాగం అధ్యక్షులుగా మయాన జహీర్, వైఎస్సార్ టీయూసీ అధ్యక్షులుగా వై.వెంకటప్పనాయుడు, సాంస్కృతిక విభాగం అధ్యక్షులుగా ఎం.ప్రతాప్‌రెడ్డి, సోషల్ మీడియా విభాగం అధ్యక్షులుగా వై.లక్ష్మిరెడ్డి, దివ్యాంగుల విభాగం అధ్యక్షులుగా డి.రెడ్డిబాబు, ప్రచార విభాగం అధ్యక్షులుగా ఎన్.గురివిరెడ్డిలను నియమించారు.

లక్కిరెడ్డిపల్లె మండల పార్టీ కమిటీ

ఉపాధ్యక్షులుగా ఎస్.అమీర్, బి.వాసుదేవుడు, ప్రధాన కార్యదర్శులుగా వి.రాజారెడ్డి, జి.రమణయ్య, షేక్ మంజూర్, వి.రాఘవరెడ్డి, కార్యదర్శులుగా వి.రవిశంకర్‌రెడ్డి, అబ్దుల్ నబీ, ఎస్.సుబ్బరాజు, ఆదిమూలం దుర్గయ్యతోపాటు 16 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమించారు.

లక్కిరెడ్డిపల్లె మండల అనుబంధ విభాగాల అధ్యక్షులు

యువజన విభాగం అధ్యక్షులుగా కె.జగన్నాథనాయుడు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఎం.రమాదేవి, రైతు విభాగం అధ్యక్షులుగా కె.మలిరెడ్డి, బీసీ విభాగం అధ్యక్షులుగా వి.లక్ష్మినారాయణ, ఎస్సీ విభాగం అధ్యక్షులుగా టి.నాగరాజు, మైనార్టీ విభాగం అధ్యక్షులుగా షేక్ బాబ్జాన్, క్రిస్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షులుగా పి.ప్రేమ్‌కుమార్, విద్యార్థి విభాగం అధ్యక్షులుగా ఎస్.సురేష్‌రెడ్డి, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులుగా ఎస్.వెంకటనారాయణరెడ్డి, ఆర్‌టీఐ విభాగ అధ్యక్షులుగా ఎం.ఓబులేశు, వలంటీర్ల విభాగం అధ్యక్షులుగా ఆర్.హరికృష్ణ, వాణిజ్య విభాగం అధ్యక్షులుగా షేక్ జాకీర్‌లను నియమించారు.

కళాశాలలో అడ్మిషన్లకు విశేష స్పందన



పెనగలూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అడ్మిషన్లకు విశేష స్పందన వస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మంగళవారం కాలేజీలో వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, సీఈసీ, బైపీసీ, ఎం.బైపీసీ గ్రూపులు ఉన్నాయన్నారు. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో విద్యార్థులు రాణించడంతో కళాశాలలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారన్నారు. కళాశాలలో అన్ని రకాల వసతులు, విశాలమైన తరగతి గదులు ఉన్నాయని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం జరుగుతోందని ఆయన తెలియజేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం



రాయచోటి టౌన్ : పట్టణంలోని మాసాపేట సుగవాసి రాజారాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఐదుగురు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లారు. వీరిని ఆ పాఠశాల హెచ్ఎం మనోహర్ బాబు ఆధ్వర్యంలో మంగళవారం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానించారు. సన్మానం పొందిన వారిలో శివకుమార్‌రెడ్డి (హెచ్ఎం రాయచోటి గొర్లమొదివీడు), మాథ్స్ అసిస్టెంట్ వేణుగోపాల్ రాజు (రాజంపేట), ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు ఎ.నాగయ్య (గువ్వల చెరువు), హిందీ టీచర్ రాజేశ్వరి (సుండుపల్లె), ఫిజికల్ డైరెక్టర్ అంబటి జగదీశ్వరయ్య (వీరబల్లె మండలం మట్లి గ్రామ జెడ్పీహెచ్ఎస్‌కు)బదిలీపై వెళ్లారు.

మేడమ్‌లు .. అంతే!



టీడీపీ నేత చమర్తిని కలిసి బుకే అందజేస్తున్న సుండుపల్లి తహసీల్దారు మహబూబ్‌చాంద్

రాజంపేట : నియోజకవర్గంలో ప్రోటోకాల్ అభాసుపాలైంది. ఇందుకు నిదర్శనం టీడీపీ నేత చమర్తి జగన్‌మోహన్‌రాజును సుండుపల్లె తహసీల్దారు మహబూబ్ చాంద్ మంగళవారం కలిసి బొకే అందజేయడమే. ప్రస్తుతం ఈ అంశం రెవెన్యూ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. టీడీపీ నేత చమర్తి జగన్‌మోహన్‌రాజు ఎమ్మెల్యే కాదు, కనీసం ప్రజాప్రతినిధిగా సైతం లేడు అనేది అందరికీ తెలిసిన విషయమే. మరి మండల మేజిస్ట్రేట్‌గా ఉన్న తహసీల్దార్లు చమర్తిని కలిసి ఏ విధంగా బొకే ఇచ్చి కృతజ్ఞతలను చెబుతున్నారన్నదే ఇప్పుడు అర్థంకాని అంశం. రాజంపేటలో అధికార పార్టీకి ఇన్‌చార్జ్ ఎవరో ఇంతవరకు టీడీపీ అధిష్టానం ప్రకటించలేదు. అయితే పలు మండలాల తహసీల్దార్లు ఏ ప్రోటోకాల్ ఉందని చమర్తి జగన్‌మోహన్‌రాజును కలిసి రెవెన్యూ సమస్యల చర్చిస్తున్నారన్నదే ఇప్పుడు నియోజకవర్గంలో హాట్‌టాపిక్‌గా మారింది. కాగా చమర్తిని ఇటీవల వీరబల్లి తహసీల్దార్ ఖాజా బీ సైతం మర్యాద పూర్వకంగా కలిసి వచ్చారు. దీంతో నియోజకవర్గంలో ప్రోటోకాల్‌ను తహసీల్దార్లు అభాసుపాలు చేస్తున్నారనే అపవాదును మూటగట్టుకుంటున్నారు. ఈ అంశంపై సుండుపల్లె తహసీల్దారును వివరణ కోరగా చమర్తి జగన్‌మోహన్‌రాజు టీడీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి అని మర్యాద పూర్వకంగా కలిశానని చెప్పుకొచ్చారు.

ఇదేం పద్ధతి.. తహసీల్దారూ?



టీడీపీ కార్యాలయంలో మంత్రి సోదరుడు లక్ష్మీ ప్రసాద్ రెడ్డితో సమావేశమైన రాయచోటి, రామాపురం, లక్కిరెడ్డిపల్లి తహసీల్దార్లు

రాయచోటి : అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం పరిధిలోని మండలాలకు నియామకమైన నూతన తహసీల్దార్లు మంగళవారం మంత్రి సోదరుడు లక్ష్మీ ప్రసాద్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాయచోటిలోని టీడీపీ కార్యాలయంలో ఉన్న లక్ష్మీ ప్రసాద్‌రెడ్డిని ఏ హోదాలో కలిశారంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. మండల మేజిస్ట్రేట్ హోదాలో ఉన్న అధికారులు ఎలాంటి హోదా లేని నాయకులతో కలవడం ఏం పద్ధతంటూ రాయచోటి నియోజకవర్గ ప్రజలు జోరుగా చర్చించుకుంటున్నారు.